నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
మంగళవారం
1 ఏప్రిల్
2025
పేజీలు 8
గుంటూరు
పల్నాడు

# ఈ జలం గరళం..!!

**తాగేది... శుద్ధ జలమేనా?**

- "ఆర్ఓ" నీటి వ్యాపారం
- పాతాళానికి పైపులేసినా తాగు నీరు దక్కేనా
- భూగర్భ జలాలు విషపూరితం
- వర్షపు నీరే పరిష్కారం
- షాకింగ్ విషయాలు వెల్లడిస్తున్న నిపుణులు

నీటి కొరత, నాణ్యత నేడు ప్రజలను వేధిస్తున్న పెద్ద సమస్యలు. గంగ, గోదావరి, కృష్ణా, కావేరి, యమున, నర్మద తదితర జీవనదులు ఉప్పొంగే దేశంలో - జల సంక్షోభం తీవ్రరూపుదాల్చడం గమనార్హం. పరిశ్రమల నుంచి వెలువడుతున్న రసాయనాలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో భూగర్భ, ఉపరితల జల వనరులు కలుషితమైన నేపథ్యంలో తరుణోపాయం తెలియని సందిగ్ధావస్థ నెలకొంది. నల్లా నీటిపై భరోసా లేక శుద్ధజలం పేరిట అమ్మే నీటిని కొనుక్కుని తాగుతున్నా రోగాలు తప్పడం లేదు. ప్రజల అవసరాలు, బలహీనతలే పెట్టుబడిగా పుట్టుకొచ్చిన శుద్ధజల కేంద్రాలు ప్రమాణాలకు పాతరేసి తాగేయోగ్యత లేని నీటినే డబ్బాల్లో నింపి ప్రజారోగ్యంతో వ్యాపారం చేస్తున్నాయి. ఈ క్రమంలో అక్రమ శుద్ధ జల కేంద్రాలపై జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేసింది. మొత్తం శుద్ధిచేసే జలాల్లో 60 శాతం నీటిని వెనక్కు ఇచ్చే సామర్థ్యంలేని రివర్స్ ఆస్మోసిస్ (ఆర్ఓ) ప్లాంట్లను డిసెంబర్ 31 లోగా నిషేధించకపోతే జనవరి నుంచి సదరు అధికారుల జీతాల్లో కోత పెట్టాలంటూ కేంద్ర

మిగతా 3వ పేజీలో

వేసవి వచ్చింది. భానుడు చండ ప్రచండ మైన ఎండతో చెలరేగిపోతున్నాడు.. దీనివల్ల భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా పాతాళానికి పైపులు వేసినా గుక్కెడు నీరు దక్కని పరిస్థితులు ఏర్పడబోతున్నాయి. చెరువుల్లో ఉన్న నీరు ఎండకు సలసలా కాగి రంగు మారి గుక్కెడు నీళ్లు నోట్లో పోసుకుని పుక్కిలిద్దామన్నా రోగాలు వస్తాయనే భయం వెంటాడుతోంది. తాగునీటి సమస్య ఎదురై బిందెడు నీళ్ల కోసం మైళ్ళ దూరం పరిగెత్తాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. దీన్ని ఆసరాగా తీసుకుని కొంతమంది మినరల్ వాటర్ పేరుతో ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు లేని నీటిని బాటిల్స్‌లో నిల్వచేసి అమ్ముతున్నారు. అనేక గ్రామాల్లో చెరువులు పూడిపోయి, గుర్రపు డెక్క ఆకు అల్లుకుపోయి ఎండకు ఎండి, చెరువు నీటిలో తడిసి కుళ్ళిపోయి నీటి రంగు మారి దుర్గంధ భరితంగా మారుతోంది. ఎక్కువమంది పల్లె వాసులు గత్యంతరం లేక ఇలాంటి నీటిని దీనివల్ల ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అనేక గ్రామాల్లో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. చివరికి గ్రామీణ ప్రాంతాల్లో కూడా భూగర్భ జలాలు ఇంకిపోయాయి. .నూటికి 80 శాతం జనం తప్పని పరిస్థితిలో ఇలాంటి కలుషితమైన నీరు తాగి రోగాల బారిన పడుతున్నారు. పల్నాడు జిల్లాలో తండాల్లో నీరు దొరకక చలమల చెంతకు పరుగులు తీస్తున్నారు. ప్రజారోగ్యానికి చేటు కలిగించే అనేక ప్రమాదకర రసాయనాలు నీటిలో కలుస్తున్నాయి. వేసవిలో స్వచ్ఛమైన నీరు ప్రజలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంది...

- గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో





# ప్రతి ఇంట ప్రగతే పి-4 లక్ష్యం

- ప్రజల ఆదాయం పెంచటమే లక్ష్యం
- ప్రపంచంలో 30% మంది తెలుగువారు ఉండాలి
- పైలెట్ ప్రాజెక్టు కింద ఎన్ని గ్రామాలు ఎంపిక

ఉగాది వేళ ఆంధ్రప్రదేశ్‌లో పీ-4 జీరో పావర్టీ అనే కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉగాది పండుగ రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పి.-4 కు శ్రీకారం చుట్టారు. దీనివల్ల కలిగే ప్రయోజనాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరించారు.. 2047 నాటికి మన ప్రజలు ఆదాయంలో వరల్డ్ నంబర్ 1గా నిలుస్తారని అన్నారు. వారిలో 30 శాతం మంది తెలుగువారే ఉండాలనేది తన ఆకాంక్షని తెలిపారు...


- గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

పీ-4 ప్రోగ్రాం అట్టడుగున ఉన్న పేదల సాధికారత కోసం చేపడుతున్నారు. మొదటగా నాలుగు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపడతారు. ఆయా గ్రామాల్లో 5,869 ఫ్యామిలీలకు లబ్ధి చేకూరుతుంది. సంపద అధికంగా ఉన్న ఫ్యామిలీలు అట్టడుగున ఉన్న ఫ్యామిలీలకు సపోర్టుగా నిలబడటమే ఈ కార్యక్రమ ఉద్దేశం. ఈ ప్రోగ్రాంలో భాగంగా లబ్ధిదారులను గ్రామ, వార్డు సచివాలయాల్లో

మిగతా 3వ పేజీలో

## డీలిమిటేషన్ పై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి

**- వి. శ్రీనివాసరావు, సి.పి.ఎం రాష్ట్ర కార్యదర్శి**




**గుంటూరు మేజర్ న్యూస్ :** డీలిమిటేషన్ పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అన్ని రాజకీయ పార్టీలతో, మేధావులతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని, తద్వారా దక్షిణాది రాష్ట్రాలలో లోక్‌సభ సభ్యుల ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదాన్ని నివారించగలమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈనెల 31వ తేదీన విజయవాడలోని బాలోత్సవ్ భవన్ లో జన చైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో డీలిమిటేషన్ పై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. వి.శ్రీనివాసరావు ప్రసంగిస్తూ ఇటీవల చెన్నైలో డీలిమిటేషన్ పై జరిగిన సదస్సుకు వైకాపా, టిడిపి, జనసేన పార్టీలు హాజరు కాకపోవడం, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొనక పోవడం దురదృష్టకరమన్నారు. రాజకీయాలకతీతంగా తమిళనాడు, కేరళ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుండి గణనీయంగా డీలిమిటేషన్ సదస్సులో పాల్గొన్నారని గుర్తు చేశారు. బిజెపి రాజకీయ ఆధిపత్యాన్ని పెంపొందించుకోవడానికి జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేసి ఉత్తరాది రాష్ట్రాలకు మేలు చేయాలనే దుర్బుద్ధితో వ్యవహరిస్తుందన్నారు. అత్యధిక సీట్లు కలిగిన చంద్రబాబు నాయుడు దేశ రాజకీయాలలో అత్యంత బలహీనంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ రాష్ట్ర చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ ఎన్. తులసీ రెడ్డి ప్రసంగిస్తూ జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేస్తే దక్షిణాది రాష్ట్రాలు ఘోరంగా నష్టపోతాయని, దేశ సమైక్యతకు సమగ్రతకు ప్రమాదం వాటిల్లుతుందన్నారు. గతంలో స్వర్గీయ ఇందిరాగాంధీ, స్వర్గీయ వాజ్ పాయ్ చేసిన విధంగా లోక్‌సభ స్థానాలను యధాతథ స్థితిలో ఉంచాలని, 2026 నుండి మహిళ రిజర్వేషన్లు మూడో వంతు అమల్లోకి వస్తే పెరిగే సీట్లను అన్ని రాష్ట్రాలకు సమ నిష్పత్తి ప్రకారం పెంచాలన్నారు. 1952లో లోక్‌సభ స్థానాలు 489 ఉండగా నేడు 543 కి చేరాయని వివరించారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి డీలిమిటేషన్ పై సభ్యుల అభిప్రాయాలను సేకరించి, తీర్మానించి, కేంద్ర ప్రభుత్వానికి పంపాలని కోరారు. భారతీయ జనతా పార్టీకి గత దశాబ్ద కాలంగా ఆంధ్రప్రదేశ్ చట్టసభల్లో ఒక్క శాతం మేర సభ్యులు లేకపోయినా అనేక సందర్భాలలో 100% సభ్యుల ఓటింగ్ మద్దతు పొందుతున్నారని తెలిపారు. 2026 జనాభా ప్రాతిపదికన లోక్‌సభ సభ్యుల స్థానాలను ప్రకటిస్తే తమిళనాడు 9, ఆంధ్రప్రదేశ్ 5, కేరళ 6, పశ్చిమబెంగాల్ 4, ఒరిస్సా 3 లోక్‌సభ స్థానాలను నష్టపోతే, ఉత్తర ప్రదేశ్ 12, బీహార్ 10, రాజస్థాన్ 7, మధ్యప్రదేశ్ 5 స్థానాలను అదనంగా పొందుతాయన్నారు. మాజీ మంత్రివర్యులు వడ్డే శోభనాద్రీశ్వర రావు ప్రసంగిస్తూ దక్షిణాది రాష్ట్రాల కంటే ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం అధిక నిధులను కేటాయిస్తుందన్నారు. లోక్‌సభ స్థానాలను కోల్పోతున్న వారికి రాజ్యసభ స్థానాలను కేటాయించి నష్టాన్ని పూడ్చాలన్నారు. 1971 జనాభా లెక్కల ప్రాతిపదికన డీలిమిటేషన్ చేస్తే ఏ రాష్ట్రానికి నష్టం సంభవించదన్నారు. శాసనమండలి మాజీ సభ్యులు కె.ఎస్. లక్ష్మణరావు ప్రసంగిస్తూ అమెరికా సెనట్ లో 100 స్థానాలు ఉన్నాయని, జనాభా పరిమాణంతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రానికి ఇద్దరి చొప్పున సెనట్ లను కేటాయించారని, హౌస్ ఆఫ్ రెప్రెసెంటేటివ్స్ గత మూడు శతాబ్దాలుగా 435 మంది కొనసాగుతున్నారని, తద్వారా ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాలేదన్నారు. ఉత్తరాది రాష్ట్రాలలో ఫ్యూడలిజం, నిరక్షరాస్యత, పేదరికంతో జనాభా గణనీయంగా పెరగడం, దక్షిణాది రాష్ట్రాలలో అక్షరాస్యత పెరగడం, పేదరికం తగ్గడం లాంటి కారణాలతో జనాభా పెరుగుదల రేటు గణనీయంగా తగ్గిందన్నారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్ట్రాలకు రాజకీయ శిక్ష వేయడం తగదన్నారు. సిపిఐ రాష్ట్ర సీనియర్ నేత ఏ. వనజ ప్రసంగిస్తూ బిజెపి దక్షిణాది రాష్ట్రాల పట్ల వివక్ష చూపుతుందని, కేంద్ర నిధులలో 60 శాతం పైగా కేవలం ఏడు రాష్ట్రాలకే కేటాయిస్తుందన్నారు. సిబిఐ, ఈడి, ఐటీ ల భయంతో అవినీతిపరులైన ప్రాంతీయ పార్టీల నేతలు కేంద్రంపై పోరాడలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశం నాలుగు ప్రధాన తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది.

1. రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ తీసుకొని అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి డీలిమిటేషన్ పై చర్చించాలి.
2. అసెంబ్లీ సమావేశం ప్రత్యేకంగా ఏర్పాటు చేసి డీలిమిటేషన్ పై చర్చించి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నష్టం కలగని రీతిలో సూచనలు, సలహాలు ఇవ్వాలి.
3. త్వరలో హైదరాబాదులో డీలిమిటేషన్ పై జరిగే సదస్సుకు ఆంధ్రప్రదేశ్ నుండి ప్రధాన రాజకీయ పార్టీలైన వైకాపా, టిడిపి, జనసేన పార్టీలు హాజరు కావాలి.
4. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ తీసుకొని అన్ని జిల్లా కేంద్రాలలో డీలిమిటేషన్ పై చర్చా గోష్టులు, సదస్సులు నిర్వహించి ప్రజాభిప్రాయాన్ని సేకరించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. రౌండ్ టేబుల్ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నేతలు నరహరిశెట్టి నరసింహారావు, కొలనుకొండ శివాజీ, సామాజిక విశ్లేషకులు డాక్టర్ కె. వసుంధర, టాక్స్ పేయర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎం.వి. ఆంజనేయులు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# అంతరాయాల సమస్యలను పరిష్కరిస్తాం

- కేంద్రమంత్రి పెమ్మసానిని కలిసిన టెలికాం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్స్ (టిప్)
- బిఎస్ఎన్ఎల్ టిప్ ఆపరేటర్లకు పెమ్మసాని భరోసా



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

“బిఎస్ఎన్ఎల్ సేవలలో సంబంధించి తరచూ తలెత్తుతున్న అంతరాయాలను, ఇబ్బందులను క్షేత్రస్థాయిలో పరిశీలించి టెలికం ఇన్ఫ్రా స్ట్రక్చర్ ప్రొవైడర్లకు సమస్య లేకుండా పరిష్కరిస్తాను.” అని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ భరోసా ఇచ్చారు. బిఎస్ఎన్ఎల్ నుంచి అందిస్తున్న ఇంటర్నెట్ (బ్యాండ్ విత్) సమస్యలు, ప్రసారాల అంతరాయాలు, బిల్ పేమెంట్లు తదితర అంశాలపై నిత్యం తలెత్తుతున్న సమస్యలను బిఎస్ఎన్ఎల్ టెలికాం ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్లు కేంద్ర మంత్రి గారికి ఆయన కార్యాలయంలో ఆదివారం కలిసి వివరించారు. స్పీడ్ ఇష్యూస్ తో పాటు చెన్నై - విజయవాడ లైన్‌లో మల్టీపుల్ లైన్ల మధ్యన తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించడంలో బిఎస్ఎన్ఎల్ అధికారులు విఫలమవుతున్నారని అలాగే బ్యాక్ ఎండ్ లోని బ్యాండ్ విత్ ప్రస్తుత అవసరాలకు తగ్గట్లుగా సౌకర్యాలు మెరుగు పరచడంలో విఫలమవుతున్నారని ఆపరేటర్లు వివరించారు. గుంటూరు జిల్లాలో ప్రస్తుతం లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి, పనిచేస్తున్న ఆపరేటర్లను కాదని, కొత్తగా ఆపరేటర్లను ఏర్పాటు చేసిన గుంటూరు జిల్లా ఉన్నతాధికారిపై ఈ సందర్భంగా ఆపరేటర్లు ఫిర్యాదు చేశారు. సమస్యలను పూర్తిగా తెలుసుకున్న పెమ్మసాని స్పందిస్తూ తక్షణమే బిఎస్ఎన్ఎల్ సిజిఎం శేషాచలం గారితో ఫోన్లో మాట్లాడారు. టిప్ ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరణ అడిగారు. సజావుగా పనిచేసే ఆపరేటర్లను ఇబ్బంది పెడితే ఊరుకోబోమని, న్యాయబద్ధంగా వాళ్ళకి అందించాల్సిన సౌకర్యాలను వెంటనే ఏర్పాటు చేయాలని, బిల్లులు చెల్లింపుల విషయంలో పారదర్శకంగా ఉండాలని ఈ సందర్భంగా పెమ్మసాని అధికారులకు సూచించారు. అలాగే క్షేత్రస్థాయిలో మోనిటరింగ్ సిస్టమ్ ను క్షుణ్ణంగా పరిశీలించి, ఎక్కడ తప్పు జరుగుతుందో వెంటనే తనకు సమాచారం ఇవ్వాలని, ఆపరేటర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం టిప్ ఆపరేటర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నాయకత్వంలో ఎవరికి అన్యాయం జరగబోదని, న్యాయబద్ధంగా, నియమ నిబంధనలకు అనుగుణంగా ఆపరేటర్లకు అందాల్సిన సౌకర్యాలను అందించేలా చూస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో టిప్ స్టేట్ ప్రెసిడెంట్ సోమశేఖర్, జనరల్ సెక్రటరీ సి. హెచ్ ప్రవీణ్, ట్రెజరర్ వై.వి రావు తదితరులు పాల్గొన్నారు.

# మాకు న్యాయం చేయండి సారూ..!!

- ఉప్పలపాడు అంగన్వాడి టీచర్ నియామకంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న దరఖాస్తుదారులు
- అర్హతలను పరిశీలించి ఉద్యోగ నియామకం చేయాలని డిమాండ్
- అంగన్‌వాడీ టీచర్ నియామకంపై బయటపడ్డ వివాదం




**వెల్దుర్తి, మేజర్ న్యూస్ :** వెల్దుర్తి మండలం, ఉప్పలపాడు గ్రామంలో అంగన్వాడీ టీచర్ నియామక ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్ సమయంలో గ్రామంలో దండోరా వేయాల్సి ఉండగా, అది జరుగకపోవడంతో కేవలం ఒకే ఒక్క దరఖాస్తును జిల్లా కార్యాలయానికి పంపించారు. ఈ అంశం జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో నోటిఫికేషన్ రద్దు చేయాల్సి వచ్చింది. అనంతరం, కొత్త నోటిఫికేషన్ ద్వారా ఎస్సీ వర్గానికి అవకాశం కల్పించగా, 8 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. అయితే, ఎటువంటి ఇంటర్వ్యూ నిర్వహించకుండా నేరుగా ఒకరిని ఎంపిక చేయడం మిగిలిన అభ్యర్థుల్లో అసంతృప్తి రేపింది. తమ అర్హతలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా నియామకం జరగాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇంటర్వ్యూ నిర్వహించి, న్యాయమైన విధానాన్ని పాటించాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు. గ్రామస్థులు మరియు అభ్యర్థులు ఈ నియామక ప్రక్రియలో పారదర్శకత కోసం అధికారుల జోక్యాన్ని ఆశిస్తున్నారు.

# రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి : ఎమ్మెల్యే నసీర్ అహ్మద్





**గుంటూరు జిల్లా. నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

అల్లాహ్ ఆశీర్వాదంతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ ఆకాంక్షించారు. సోమవారం రంజాన్ పర్వదినం సందర్భంగా గుంటూరులోని ఉర్దూ ముస్లిం హైస్కూల్, ముస్లిం కాలేజీల్లోని ఈద్గాలలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి పాల్గొన్నారు.

**కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానితో కలిసి రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు**

తొలుత వీరికి ముస్లిం మత పెద్దలు ఘన స్వాగతం పలికి ఆశీర్వదించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ క్రమశిక్షణ, దానధర్మాలు, కఠోర దీక్షతో నెల రోజులపాటు ఉపవాస దీక్షలు ఆచరించారని, దీని ద్వారా మనిషి జీవితాన్ని సక్రమ మార్గంలో ఎలా నడుపుకోవాలో బోధపడుతుందని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లిం మైనారిటీలకు మంచి రోజులొచ్చాయని పేర్కొన్నారు. గతంలో ముస్లిం మైనారిటీలపై దాడులు జరిగేవని, ఇప్పుడు మైనారిటీలకు ప్రభుత్వం రక్షణగా నిలుస్తోందని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మౌజన్లు, ఇమామ్ లకు గౌరవ వేతనం విడుదల చేసి వారి ఆత్మ గౌరవాన్ని మరింత పెంచారని తెలిపారు.

# ఈ జలం గరళం..!!

(మొదటి పేజీ తరువాయి)

పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖకు ఆదేశాలిచ్చింది. మొత్తం కరిగిన లవణాల సాంద్రత (టీడీఎస్) లీటర్‌కు 500 మిల్లీ గ్రాములకంటే తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆర్ఓ నీటిని నిషేధించాలని ఉత్తర్వులిచ్చింది. దీనిపై స్టే విధించాలంటూ ఆర్ఓ ప్లాంట్ల తయారీదారుల సంఘం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, కేంద్రంలోని సంబంధిత శాఖను సంప్రతించాలని సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. అయితే, ఆర్ఓ నీటిని పూర్తిగా పక్కనపెట్టేయలేని పరిస్థితులూ ఉన్నాయి. ఆర్ఓ నీటిని కలుషిత నీటికి ప్రత్యామ్నాయంగానే మాత్రమే కాకుండా, ఫ్లోరైడ్, లోహాల గాఢత, హానికర మూలకాల ముప్పు ఎక్కువగా ఉన్నచోట వాటి నుంచి బయటపడేందుకు ప్రజలు శుద్ధజలం వాడుతున్నారు. ఉదాహరణకు ఉభయ గోదావరి జిల్లాల్లో రెండు పంటలకు వినియోగిస్తున్న రసాయన ఎరువులు, పురుగు మందులు, రొయ్యల సాగు వ్యర్థాలు, ఆక్వాకు వినియోగిస్తున్న ఉప్పు జలాల కారణంగా చాలా ప్రాంతాల్లో తాగు, సాగు నీరుకలుషితమైంది. ఆర్ఓ పరిజ్ఞానంతో శుద్ధి చేస్తేతప్ప ఈ నీటిని తాగడానికివినియోగించలేని దుస్థితి నెలకొంది. నీరు స్వచ్ఛంగా కనిపించినంత మాత్రాన నాణ్యత ఉన్నట్లు కాదు. కంటికి కనిపించని క్షారత్వం, ఆమ్లత్వం, భార లోహాల గాఢత్వం పరీక్షల ద్వారా మాత్రమే తెలుస్తుంది. అందువల్ల భారత ప్రమాణాల సంస్థ (బీఐఎస్) నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం శుద్ధిచేసిన నీటికి, సాధారణ యంత్రాలతో శుద్ధి చేసిన నీటికి మధ్య తేడా పెద్దగా తెలియదు. రుచి, నాణ్యతను మినహాయిస్తే చూడటానికి రెండూ ఒకేలా కనిపిస్తాయి. సరిగ్గా ఈ అంశమే ఆర్ఓ ప్లాంట్ల నిర్వాహకులకు కాసులు కురిపిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేలకోట్ల రూపాయలు ఖర్చు చేసి అందిస్తున్న రక్షిత నీరు, అక్కరకు రాకుండా పోతుంటే ప్రైవేటు శక్తులు సరఫరా చేసే ఆర్ఓ నీరే దిక్కవుతోంది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా అంతటా శుద్ధజలం పేరిట నాణ్యత లేని నీరే ముంచెత్తుతోంది. స్థానిక ప్రభుత్వాలు సరఫరా చేసే నల్లా నీటిని కాదని, శుద్ధజలం పేరిట ఇలాంటి డబ్బా నీటివైపు ప్రజలు మళ్లడానికి కారణాలు లేకపోలేదు. తెలుగు రాష్ట్రాల్లో భారీసంఖ్యలో తాగునీటి జలాశయాలు, రక్షిత మంచినీటి పథకాలు ఉన్నా నిర్వహణ అధ్వానంగా ఉంటోంది. సకాలంలో జలాశయాలు, ట్యాంకులను శుభ్రం చేయకపోవడం, లీకేజీల కారణంగా కుళాయిల ద్వారా వచ్చే నీళ్లు కలుషితమవుతున్నాయి. స్థానిక సంస్థల సిబ్బంది క్లోరినేషన్ వరకు పరిమితమై, అదే నీటిని పైపుల ద్వారా ఇళ్లకు సరఫరా చేస్తున్నారు. రాష్ట్ర విభజనకు ముందు 2009లో, అనంతరం 2014 తరవాత ఉభయ రాష్ట్రాల్లో పంపిణీ చేసిన నీటిపరీక్ష కిట్లను ఎక్కడా వాడిన దాఖలాలు లేవు. పలు నగరాలు, పట్టణాల్లో 30-40 ఏళ్ల క్రితం తవ్వి వేసిన గొట్టంమార్గాలు తుప్పుపట్టి, చిల్లులు పడి శిథిలమయ్యాయి. వాటిపక్కనే మురుగునీటి పారుదల వ్యవస్థా ఉండటంతో.. రెండూ కలిసిపోయి తాగునీరు కలుషితమవుతోంది. నాణ్యత, నిర్వహణను బట్టి రెండు మూడు దశాబ్దాలకోసారి భూగర్భ గొట్టంమార్గాల్ని మార్చాల్సి ఉన్నా, ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఫలితంగా సర్కారు సరఫరా చేసే తాగునీటిపై నమ్మకం కుదరక, వాటిని తాగేందుకు జనం విముఖత చూపుతున్నారు. వ్యయ భారమైనా డబ్బా నీటినే కొనితాగుతున్నారు.

జర్మనీ, రష్యా,అమెరికాల్లో ఆర్ఓ నీటిపై నిషేధం లేకున్నాఅక్కడిప్రభుత్వాలు ప్రోత్సహించడం లేదు. మనదేశంలో మాత్రం ఆర్ఓ ప్లాంట్లపై కనీస పర్యవేక్షణకొరవడినందువల్ల నీటి వ్యాపారం వేలకోట్ల రూపాయలకుపడగలెత్తింది. తెలుగు రాష్ట్రాల్లో నీటిశుద్ధి కేంద్రాలపై నియంత్రణ లేకుండా పోయింది. వాటి సంఖ్య ఎంత అనే లెక్కలే లేవు. ఓ అంచనా ప్రకారం ఉభయ రాష్ట్రాల్లో 18 వేలకిపైగా ఆర్ఓ ప్లాంట్లు నడుస్తుండగా, వాటిలో 90 శాతం కేంద్రాలు అనుమతులు లేకుండానే వ్యాపారం సాగిస్తున్నాయి. హానికర సూక్ష్మజీవులతో కూడిన జలాన్ని ప్రజల గొంతుల్లోకిదింపుతున్నాయి. బీఐఎస్ నియమాలకు అనుగుణంగా ప్లాంటు పెట్టాలంటే- పాతిక నుంచి ముప్పై లక్షల రూపాయల ఖర్చవుతుంది. అప్పుడు 20 లీటర్ల డబ్బాకు రూ.30 దాకా ఖరీదు పెట్టాల్సి వస్తుంది. ప్రజలు అంత ధర పెట్టరనే ఉద్దేశంతో నాలుగైదు లక్షల రూపాయల విలువైన ప్లాంటు పెట్టేసి, నామమాత్రంగా శుద్ధిచేసి ఖనిజాలు, నాణ్యత లేని నీటిని విక్రయిస్తున్నారు. అసలు నీళ్ల వ్యాపారం చేయాలంటే వివిధ శాఖల అనుమతులుతీసుకోవాలి. ముందుగా బీఐఎస్ వద్ద నమోదుచేయించుకోవాలి.ప్లాంట్లలో ప్రయోగశాలలు ఉండాలి. ఒక ఫార్మసిస్టు, ఒక మైక్రోబయాలజిస్టు సహానలుగురుఉద్యోగులను నియమించాలి. మూడు నెలలకోసారి గుర్తింపు పొందిన ప్రయోగశాలల్లో పరీక్ష చేయించాలి. నీటిలో లవణాలు, ఖనిజాలు ప్రమాణాల ప్రకారం ఉంటేనే డబ్బాల్లో నింపాలి. తేదీని ముద్రించాలి. నీటిలోని మలినాలు, లోహాల గాఢతనుబట్టి యంత్రాల్లో ఫిల్టర్లు, మెమ్రెయిన్లను తరచూ మార్చాలి. కనీసం ప్రతి 10వేల లీటర్ల నీటి శుద్ధికి ఒకసారైనా కొత్త ఫిల్టర్లు వాడాలి. అయితే, వ్యాపారులు ఇలాంటి నిబంధనలేవీపాటించకుండా, జీఎస్టీ సైతం చెల్లించకుండా యథేచ్ఛగా వ్యాపారం చేస్తున్నారు.

**వాన నీరే పరిష్కారం?**

ఏటికేడు భూగర్భ జలాలు తగ్గిపోతుండటం, పురుగు మందుల అవశేషాలు, భారలోహ మూలకాలతో భూమి లోపలి జలం కలుషితమవుతుండటం వల్ల బోరు నీటి వాడకం శ్రేయస్కరం కాదని అధ్యయనాలుచెబుతున్నాయి. ఈ క్రమంలో అన్ని రకాల నీటి వనరులు కలుషితమైన పరిస్థితుల్లో వర్షం నీటిని ఒడిసిపట్టి శుద్ధిచేసుకొనితాగడంకంటే మించిన ప్రత్యామ్నాయం లేదు. భూగర్భ జల గాఢత తగ్గాలన్నా, ఉప్పునీటి సమస్యకు పరిష్కారం దక్కాలన్నా వాననీటిని భూమిలోకి ఇంకించాల్సిందే. అప్పుడే పాతాళ జలం స్వచ్ఛంగా మారుతుంది. ఇందుకు ప్రభుత్వాలు ఇళ్లల్లో ఇంకుడు గుంతలు, పొలాల్లో బోరు రీఛార్జి ఛాంబర్ల నిర్మాణాల్ని రాయితీల ద్వారా ప్రోత్సహించాలి. గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో ప్రభుత్వం సరఫరా చేసే నల్లా నీటిలో టీడీఎస్300మి.గ్రా.లోపు, ఖనిజాలు సమతౌల్యంగా ఉంటే ఆ నీటినే కాచి వడపోసి తాగడం ఉత్తమం. ఆర్ఓ నీటికి ఐఎస్ఐ గుర్తింపు ఉండాలని నిపుణుల సూచన. ఆర్ఓ ప్లాంట్ల ఏర్పాటు, నియంత్రణకు పటిష్ఠమైన నిబంధనలు రూపొందించాలి. బీఐఎస్ నిర్దేశిత నిబంధనలకు అనుగుణంగా స్థలం, యంత్రాలు, సిబ్బంది, శుద్ధి ఏర్పాట్లు ఉంటేనే నీటిప్లాంట్లకు అనుమతులివ్వాలి. డబ్బానీటిపై పంచాయతీ, రెవిన్యూ, జలవనరుల శాఖలకు పర్యవేక్షణ బాధ్యత అప్పగించాలి. స్థానికంగా ప్రజలు తాగునీటికి వినియోగించే చెరువులు, చేతి పంపులు, బావులు, బోర్ల నీటిలో టీడీఎస్, పీహెచ్‌ను నెలకోసారి పరీక్షించాలి. రసాయనాల గాఢత, హానికర మూలకాల స్థాయుల వివరాల్ని ప్రజలకు తెలిపే ఏర్పాట్లుండాలి. ఫలితాలనుబట్టి సంబంధిత నీటిని వినియోగించ వచ్చో లేదో తెలపాలి. సీసం, పాదరసం, ఆర్సెనిక్, ఫ్లోరైడ్ మూలకాలు అధికంగా ఉంటే ఆ నీటి వాడకాన్ని నిషేధించాలి. స్థానిక సంస్థలు సరఫరా చేసే తాగునీటి నాణ్యత బీఐఎస్ ప్రమాణాల మేరకు ఉండే ప్రాంతాల్లో శుద్ధజలం పేరిట జరిగే వ్యాపారాన్ని నిషేధించాలి!

**తాగేది... శుద్ధ జలమేనా?**

తాగే నీటిలో కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, మాంగనీస్ తదితర సూక్ష్మ ధాతువులు నిర్దేశిత మోతాదులో ఉండాలి. ఇవి ఆహారంతోపాటు నీటి ద్వారా కూడా శరీరానికి అందుతాయి. ఏది ఎక్కువైనా రోగాల ముప్పు తప్పదు. తాగునీటిలో మొత్తం కరిగిన లవణాల సాంద్రత(టీడీఎస్) లీటరుకు 300 నుంచి 500 మి.గ్రా., ఉదజని పీహెచ్ ఏడు శాతం ఉండాలి. అయితే ఆర్ఓ పద్ధతిలో అతి సూక్ష్మయంత్రాలతో నీటిని శుద్ధి చేసినప్పుడు మలినాలు, సూక్ష్మజీవులతోపాటు ఉపయుక్తమైన ఖనిజాలూ పోతున్నాయి. టీడీఎస్ 100 లోపే ఉంటోంది. జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ(ఎన్ఐఆర్‌డీ) నిర్వహించిన అధ్యయనం సైతం ఇదే విషయాన్ని తెలిపింది. దేశవ్యాప్తంగా కొన్ని నీటి శుద్ధి కేంద్రాల్లో సేకరించిన నమూనాల్లో కాల్షియం, మెగ్నీషియం స్థాయులు బాగా తక్కువగా ఉన్నట్లు గుర్తించింది. శుద్ధిచేసిన నీటిని రోజుల తరబడి నిల్వ ఉంచుతున్నందువల్ల అవికలుషిత మవుతున్నాయి. అంతేకాకుండా అపరిశుభ్ర వాతావరణం, డబ్బాలు, నిల్వ ట్యాంకుల అపరిశుభ్రత కారణంగా అనేక ప్లాంట్లలో ప్రమాదకరమైన సూక్ష్మజీవులు బయటపడ్డాయి. ఆర్ఓ ప్రక్రియలో అనుసరించే కొన్ని పద్ధతుల వల్ల దీర్ఘకాలంలో వివిధ శరీర భాగాలపై ప్రభావం పడుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎప్పుడో హెచ్చరించింది.

**భూగర్భ జలాలు విషపూరితం..**

భూగర్భజలాల కాలుష్యం గురించి పార్లమెంట్‌లో కేంద్రం చెప్పిన విషయాలు షాక్‌కు గురిచేస్తున్నాయి. ఈ జలాల నాణ్యత క్షీణిస్తోందని రాజ్యసభలో కేంద్రం అంగీకరించింది. గణాంకాల ప్రకారం.. ప్రస్తుతం మనం తాగుతున్న నీరు విషపూరితమని, దాదాపు అన్ని రాష్ట్రాల్లోని చాలా జిల్లాల్లో భూగర్భ జలాల్లో విషపూరిత లోహాలున్నాయని వెల్లడవుతోంది. ఆర్సెనిక్, ఐరన్, కాడ్మియం, క్రోమియం, యురేనియం మోతాదులను మించి ఉన్నాయి. జలశక్తి మంత్రిత్వశాఖ ప్రకారం.. దేశంలో 80 శాతంమంది భూమి నుంచే నీటిని సేకరిస్తున్నారు. భూగర్భ జలాల్లో ప్రమాదకర లోహాలు నిర్దేశిత మోతాదు కంటే అధికంగా ఉంటే.. ఆ నీరు విషపూరితమేనని మంత్రిత్వ శాఖ దస్త్రాలు చెప్తున్నాయి. తాగునీటి వనరులు కలుషితమవుతున్న నివాస ప్రాంతాల సంఖ్యను కూడా కేంద్రం రాజ్యసభలో వెల్లడించింది. ఫ్లోరైడ్ (671), ఆర్సెనిక్(814), ఐరన్(14,079), సాలినిటీ (9,930), నైట్రేట్(517), ఇతర భారలోహాలు (111)తో ఆయా ప్రాంతాల్లో నీటివనరులు కాలుష్యమయంగా మారాయి. ఈ విషయంలో నగరాల్లో కంటే గ్రామాల్లోనే పరిస్థితి ఆందోళన కరంగా ఉంది. నీటిలోని మలినాలను తొలగించే వ్యవస్థ లేకపోవడంతో వారు ఆ కలుషిత నీటిని తాగాల్సివస్తోంది. ప్రభుత్వం చెబుతున్న దానిక ప్రకారం మామూలుగా ఒక మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే.. రోజుకు కనీసం రెండు లీటర్ల నీరు తాగాలి. ప్రస్తుత గణాంకాలను బట్టి రోజుకు రెండు లీటర్లు తాగితే.. కొంత మొత్తంలో విషపూరిత పదార్థాలు లోపలికి వెళ్తున్నట్టే.

**అనారోగ్యానికి దగ్గరయినట్లే..!**

ఆర్సెనిక్... చర్మ వ్యాధులు, క్యాన్సర్.
ఐరన్.. నాడీవ్యవస్థపై ప్రభావం(అల్జీమర్స్, పార్కిన్సన్స్)
లెడ్.. నాడీ వ్యవస్థపై ప్రభావం
కాడ్మియం.. కిడ్నీ సంబంధిత వ్యాధులు
యురేనియం.. కిడ్నీ సంబంధిత వ్యాధులు, క్యాన్సర్
క్రోమియం..చిన్నపేగులో కణుతులు వచ్చే ప్రమాదం

**ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేంటి..?**

నీరు.. రాష్ట్రాల పరిధిలోని అంశమని పార్లమెంట్‌లో కేంద్రం వెల్లడించింది. పరిశుభ్రమైన తాగునీటిని అందించడం రాష్ట్రాల బాధ్యత. అయితే ఈ విషయంలో కేంద్రం కొన్ని పథకాలు అమలు చేస్తోంది. 2019లో తీసుకువచ్చిన జల్‌జీవన్ మిషన్ కింద 2024 నాటికి ప్రతిగ్రామంలో ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు లోక్‌సభలో సమాధానం చెప్పింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న 19.15 కోట్ల గ్రామీణ కుటుంబాలు ఉండగా.. ఈ పథకం కింద 9.81 కోట్ల కుటుంబాలకు కుళాయి నీరు అందుతోందని చెప్పింది. అలాగే 2021లో ప్రారంభించిన అమృత్ 2.0 కింద 2026 నాటికి అన్ని నగరాల్లో కుళాయి నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## ఘనంగా స్నిగ్ధా ఆయుర్వేద ఆసుపత్రి రజతోత్సవాలు

### ముఖ్య అతిథిగా ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



**గుంటూరు మేజర్ న్యూస్ :** పచ్చని పంటచేల మధ్య నాణ్యమైన స్నిగ్ధా ఆయుర్వేద ఆసుపత్రి నిర్మాణం చేసి పలు ఆరోగ్య సేవలు అందిస్తున్న సంతోషంగా ఉందని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. స్నిగ్ధ ఆయుర్వేద వైద్య శాల సిల్వర్ జూబ్లీ వేడుకలు స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల ప్రాంగణము పుత్తూరు నందు ఫౌండర్ డాక్టర్ కె శివరామ గోపాలన్ అధ్యక్షతన సోమవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైద్యారోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ గౌరవ అతిథులుగా పత్తిపాడు శాసనసభ్యులు రామాంజనేయులు గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు నసీర్ అహ్మద్, వల్లూరు జయప్రకాశ్ నారాయణ విచ్చేశారు. నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ పంచకర్మ టెక్నీషియన్ కోర్స్ స్నిగ్ధా ఆసుపత్రిలో పెట్టడం ముదాహం అన్నారు. ఆదాయం వచ్చే వైద్యం వైపు కాకా ఆదాయం తక్కువ వచ్చే ఆయుర్వేదం ఆసుపత్రి పెట్టడం దానిని ఈ స్తాయికి తేవడం గొప్ప విషయం అన్నారు. దార్శనికత కలిగిన కూటమి నేతలు మధ్య మంత్రిగా చేయడం గర్వాంగా ఉంది. బూర్ల రామాంజనేయులు ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయువును పెంచేది ఆయుర్వేదం, ఆరోగ్యమే మహాభాగ్యం అనేది పెద్దల సూక్తి అని అన్నారు.ఆరోగ్యం అనేది తల్లి ఒడి నుండి మొదలై ప్రకృతి ఒడిలోకి వస్తుంది. ప్రకృతి ధర్మాన్ని మనం పాటిస్తే ఆరోగ్యమే మహాభాగ్యం అని పేర్కొన్నారు. స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల పొత్తూరు విభాగంలో సిల్వర్ జూబ్లీ వేడుకలు సందర్భంగా ఫౌండర్ మరియు చీఫ్ ఫిజిషన్ డాక్టర్ కేఎస్ఆర్ గోపాలన్ మాట్లాడుతూలి తమ 25 సంవత్సరాల ప్రయాణంలో ఆయుర్వేద వైద్యం మీద నమ్మకంతో ఉన్న పేషెంట్స్ అభిమాన ఆదరణలతో క్లినికల్ పంచకర్మ సెంటర్ గా గుంటూరు అరండల్ పేట నాలుగో లైన్ లో మొదట ప్రారంభించి వివిధ ప్రదేశాలలోని పేషెంట్స్ అవసరంలను తీర్చుటం కొరకు క్రమముగా నాలుగు శాఖలుగా విస్తరింపజేసి తెలుగు రాష్ట్రాలలో మొట్టమొదటిగా 126 పడకలతో మల్టీ స్పెషాలిటీ విభాగం ప్రారంభించి క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియా ద్వారా ఎన్ ఎబిహెచ్ అ క్రిడేషన్ పొంది మొట్టమొదటి ఇన్సూరెన్స్ సౌకర్యం కల ఆయుర్వేద వైద్యశాలగా సేవలందించుచున్నామని తెలిపారు. 25వ వార్షికోత్సవంలో నిష్ణాతులైన పంచకర్మ నర్సింగ్ వారిని తయారు చేయడం నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా గుర్తింపు కలిగిన పంచకర్మ టెక్నీషియన్ కోర్స్ ఆరోగ్యశాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ చేతుల మీదుగా పత్తిపాడు శాసనసభ్యులు రామాంజనేయులు, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సమక్షంలో ప్రారంభించినట్లు తెలియజేశారు ఈ సందర్భంగా తమకు మొదటి నుండి సహాయ సహకారములు అందిస్తున్న పేషెంట్స్, కుటుంబ సభ్యులు, డాక్టర్ చైతన్య తమ వైద్య సిబ్బంది వైద్యేతర సిబ్బందికి ధన్యవాదములు తెలియచేశారు. స్నిగ్ధ ఆయుర్వేదిక్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ చైతన్య మాట్లాడుతూలి పేద ప్రజలు ఆయుర్వేద వైద్యం గురించి అవగాహన లేక కొంత ఖర్చుతో కూడుకున్నదని అన్నారు. ఈ సేవా సంస్థను స్థాపించి కారుణ్య పథకము నిరుపేదకు నేస్తం అనే పేరిట పది రూపాయల ఫీజుతో వైద్యం చికిత్స ఖర్చులో 50 శాతం రాయితీ మందులలో 20 శాతం రాయితీ అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, లైవ్ భారత్ ఫౌండేషన్ చైర్మన్ వల్లూరు జయప్రకాష్ నారాయణ డాక్టర్ ప్రేమానంద్ డాక్టర్ విజయభాస్కర్ డాక్టర్ సాయి సుధాకర్, మన్నవ రాధాకృష్ణమూర్తి హిమసాగర చంద్రమూర్తి, కేఎస్ఆర్ కుటుంబరావు, సుదర్శన్, స్నిగ్ధ ఆయుర్వేద ఫౌండేషన్ మేనేజింగ్ ట్రష్టి డాక్టర్ కె చైతన్య, బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరు తిరుపతిలో జనసేన నాయకులు కొర్రపాటి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంట ప్రగతే పి-4 లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న సమాచారంతో పాటు సర్వే, గ్రామసభల ద్వారా గుర్తిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 40 లక్షల ఫ్యామిలీలు దీనికి అర్హులుగా నిలుస్తుండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో సర్వే చేశారు. ఈ సర్వే ద్వారా అట్టడుగున ఉన్న వారిని గుర్తిస్తారు. లబ్ధిదారుల ధ్రువీకరణ అనంతరం వారి వివరాలను సమృద్ధి బంధనమ్ ప్లాట్‌ఫాంలో ఉంచుతారు. లబ్ధిపొందాల్సిన ఫ్యామిలీలను సాయం చేసే ఫ్యామిలీలతో అనుసంధానించడమే ఈ పీ-4 విధానంలో సర్కారు పాత్ర. నేరుగా సర్కారు ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించదు. ఆయా కుటుంబాలు ఇందులో స్వచ్ఛందంగానే పాల్గొనవచ్చు. ఈ ఏడాది ఆగస్టు నాటికి ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 5 లక్షల కుటుంబాలను భాగస్వామి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పీ-ఈ విధానం ద్వారా అట్టడుగున ఉన్న 20% మందికి మేలు జరుగుతుంది. ప్రభుత్వం, ప్రైవేటుతో పాటు ప్రజలు భాగస్వాములై పేదరిక నిర్మూలన కోసం పనిచేయాల్సి ఉంటుంది. సంపదలో ఉన్నత స్థితిలో ఉన్న వారిలో 10% మంది అట్టడుగున ఉన్న వారిలో 20% మంది పేదలను దత్తత తీసుకోవాల్సి ఉంటుంది. దీని ద్వారా ఆర్థిక అసమానతలు రూపుమాపొచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

# భక్తి శ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు





**మంగళగిరి, మేజర్ న్యూస్:**

పవిత్ర రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాలు, మసీదుల వద్దకు అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఇమామ్ లు మాట్లాడుతూ ప్రేమ, సోదర భావం, శాంతికి చిహ్నమే రంజాన్ పర్వదినమన్నారు. ప్రతి ఏడాది ముస్లిం సోదరులు రంజాన్ పర్వదినాన్ని జరుపుకుంటారని, నెల రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలు ఉండి అల్లా అనుగ్రహం పొందుతారని తెలిపారు. ఆ అల్లాహ్ చల్లని దీవెనలతో చక్కగా వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. నగరంలోని ఈద్గా షాదీ మహల్ వద్ద పోలీసులు ముస్లింల మత ప్రార్థనలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. అదేవిధంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ముస్లిం సోదరులు వారి కుటుంబ సభ్యులతో ఆహ్లాదకరమైన, ఆధ్యాత్మిక వాతావరణంలో రంజాన్ వేడుకలను జరుపుకున్నారు.

# పి ఫోర్ ద్వారా పేదరిక నిర్మూలన

**- టిడిపి రాష్ట్ర కార్యనిర్వ కార్యదర్శి కత్తెర సురేష్ కుమార్ వెల్లడి**

**గుంటూరు జిల్లా పరిషత్, మేజర్ న్యూస్**

ఆంధ్రప్రదేశ్ పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టిన పి ఫోర్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ పేర్కొన్నారు. దీనివలన పేద బడుగు బలహీన వర్గాలతో పాటు పేదరికంలో ఉన్న అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. ఉన్నత స్థితిలో ఉన్నవారు పేదరికంలో ఉన్నవారికి సహాయపడే విధంగా ఈ పథకాన్ని రూపొందించారని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ సారధ్యంలో ఈ కార్యక్రమం చేపట్టటం ముదావహం అన్నారు.



పేదరిక నిర్మూలనకు చేపట్టిన పి ఫోర్ ద్వారా ఎంతో మందికి లబ్ది చేకూరుతుందన్నారు. దీనిని అందరూ ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. పేద ప్రజలకు ఇది వరం లాంటిదని సురేష్ కుమార్ పేర్కొన్నారు.

# ఐ ఆర్ ఎస్ అధికారికి ఘన సన్మానం



**గుంటూరు జిల్లా పరిషత్, మేజర్ న్యూస్**

గుంటూరు కన్నవారి తోటలోని తెలుగు బాప్తి చర్చిలో ఆదివారం ఐ ఆర్ ఎస్ ఆఫీసర్ ఆనంద్ కుమార్ కు ఆనందకుమార్ మిత్రమండలి ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది ఈ సందర్భంగా ఆయన చర్చిలో క్రీస్తు సందేశాన్ని అందించారు క్రీస్తు ద్వారా ప్రపంచం రక్షించబడుతుందని ఆయన మార్గం ఆచరణీయమని పేర్కొన్నారు కార్యక్రమంలో రిటైర్డ్ డిఐజి బాలస్వామి ఏపీపీ సుకుమార్ అత్తోట జోసెఫ్ న్యాయవాది శరత్ బాబు పులివర్తి లక్ష్మయ్య చర్చి నిర్వాహకులు పినపాటి నానారావ్ సంఘ కాపరులు పాల్గొన్నారు.

# శివాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా భోగి కోటేశ్వరరావు

## ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

## డైరెక్టర్లుగా 8 మంది నియామకం

**మంగళగిరి, మేజర్ న్యూస్:**

ఎంతో కాలంగా పార్టీని నమ్ముకుని, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ, సేవలందిస్తున్న వారికి నామినేటెడ్ పదవుల పంపకంలో ప్రాధాన్యతను కల్పిస్తున్నారు. మంగళగిరిలోని శ్రీ గంగా భ్రమ రాంబ సమేత మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం (శివాలయం) ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా భోగి కోటేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనతో పాటు 8 మందిని ట్రస్ట్ బోర్డు డైరెక్టర్లుగా నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. భోగి కోటేశ్వరరావు కొద్ది కాలంగా తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ వస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన కూటమి ప్రభుత్వం ఆయనకు శివాలయం ట్రస్ట్ బోర్డు పగ్గాలను అప్పగించింది. తనకు పదవి కేటాయించిన మంత్రి, స్థానిక ఎమ్మెల్యే టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కు, సహకరించిన స్థానిక నాయకులకు భోగి కోటేశ్వరరావు కృతజ్ఞతలు తెలియజేశారు.



**డైరెక్టర్లు వీరే..!**

శివాలయం ట్రస్ట్ బోర్డుకి 8 మందిని డైరెక్టర్లుగా నియమించారు. సుఖమంచి గిరిబాబు, ఏ కరుణ, జంజనం వెంకట సుబ్బారావు, బాపనపల్లి వాసు, చిలకా బసవమ్మ, ఉడత లావణ్య, ఇసుకపల్లి వెంకట లలిత, తిరుమల శెట్టి మురళీకృష్ణ లను శివాలయం ట్రస్ట్ బోర్డుకు డైరెక్టర్లుగా నియమించారు. ఆలయ అర్చకులు మహేష్ కుమార్ ను ట్రస్ట్ బోర్డు ఎక్స్ అఫీషియో నెంబర్ గా ఎన్నుకున్నారు. నూతనంగా పదవులు పొందిన వారందరికీ పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# మీసాల శ్రీనివాసరావుకి ఘన సత్కారం

**వినుకొండ మేజర్ న్యూస్:**

వినకొండ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన న్యాయవాది మీసాల శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో నియోజకవర్గ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు మీసాల శ్రీనివాసరావు సేవలను కొనియాడారు. బార్ అధ్యక్షునిగా యాదవులకు లభించటం అభినందనీయమన్నారు. అంచలంచలుగా ఎదుగుతూ బార్ అధ్యక్షుడిగా ఎన్నికైన మీసాల శ్రీనివాసరావు భవిష్యత్తులో మరెన్నో పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మీసాల శ్రీనివాసరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు స్వీట్లు పంచి పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు మీసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ వినుకొండ బార్ అసోసియేషన్ పరిధిలోని సీనియర్, జూనియర్ న్యాయవాదులు అందరూ మద్దతు తెలియజేసి తన గెలుపుకు కారణమయ్యారన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా బాధ్యతగా పనిచేస్తానని తనపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. అలాగే బార్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికల్లో అధ్యక్షునిగా గెలుపొందటం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.



ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావుల తోపాటు కూటమి నాయకులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో 30 వేల పైచిలుకు జనాభా ఉన్న యాదవులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులకు మీసాల శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. సత్కార కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు ఆలా శ్రీనివాసరావు, మద్దుల సత్యనారాయణ, రావులపల్లి కొండ గురవయ్య(ఆర్.కె), బత్తుల శ్రీనివాసరావు, కన్నెబోయిన వెంకటేశ్వర్లు, శ్రీనివారావు, కిష్టం శ్రీనివాసరావు, నర్రా శ్రీను, ఒంటేల శ్రీనివాస్ యాదవ్, కన్నెబోయిన బాలకృష్ణ, బిఎస్ఎన్ఎల్ కొండలు, తెల్లమేకల శ్రీనివాసరావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మహిళ కౌన్సిలర్‌ను పరామర్శించిన : జూలకంటి



**మాచర్ల ప్రతినిధి, మేజర్ న్యూస్ :**

పట్టణంలోని 23వ వార్డులో తెలుగుదేశం పార్టీ మహిళా నేత, మాజీ కౌన్సిలర్ వీర్ల పాపమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి, అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సోమవారం స్వయంగా ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. యోగ క్షేమాలను కనుక్కొని, అందుతున్న వైద్యపరమైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏమీ అధైర్యపడవద్దు అని, అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట తెలుగుదేశం పార్టీ యాదవ నాయకులు, పట్టణ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# దానధర్మాలకు ప్రతీక రంజాన్

**- ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి**



**నరసరావుపేట రూరల్, మేజర్ న్యూస్:**

క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనలతో కూడిన రంజాన్ పర్వదినం ముస్లిం సోదరులకు ఎంతో పవిత్రమైందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం నరసరావుపేట పట్టణంలోని ప్రకాశ్ నగర్ వద్ద ఉన్న ఈద్గాలో ఆయన అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ముస్లిం మత పెద్దలు, సోదరులతో కలిసి ఈద్-ఉల్-ఫిత్ర ప్రార్థనలు చేశారు. ఒకర్నొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఐపిడి కాలనీ ఈద్గాలో రంజాన్ ప్రార్ధనలు



**గుంటూరు రూరల్ మేజర్ న్యూస్**

పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక ఐపిడి కాలనీ ఈద్గాలో పెద్ద ఎత్తున ప్రార్థనలు నిర్వహించారు. ఈద్గా అధ్యక్షుడు మీర్ అబ్బాస్ అలీ పర్యవేక్షణలో పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు ఈ ప్రార్ధనలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. తూర్పు శాసనసభ్యులు మహమ్మద్ నసీర్ అహ్మద్ ఈద్గా ప్రార్ధనలకు అనువుగా షామియానాలు,కార్పెట్లు, కూలర్లు,వాటర్ డ్రమ్ములు అందజేశారు.అలాగే మినరల్ వాటర్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మీర్ అబ్బాస్ అలీ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ పర్వదినం రోజున ఈద్గాలో పెద్ద ఎత్తున ప్రార్థనలు నిర్వహించటం సంతోషదాయకంగా ఉందన్నారు. గత 30 సంవత్సరాలుగా ఈద్గా అభివృద్ధి చేయటం జరిగిందన్నారు. అందరి సహకారంతో మరింత అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామన్నారు. రంజాన్ సందర్భంగా అనేక సౌకర్యాలు కల్పించిన స్థానిక ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా రంజాన్ పర్వదిన విశిష్టతను మీర్ అబ్బాస్ అలీ వివరించారు.ఈ కార్యక్రమంలో ఈద్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్,ఎంఎస్పీ నూతన కమిటీల నియామకం

## - విజయపురిసౌత్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడుగా ఊరే మధు



**మాచర్ల ప్రతినిధి /విజయపురి, మేజర్ న్యూస్:**

మహాజన నేత, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు విజయపురిసౌత్ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన కమిటీ లను సోమవారం ఎన్నుకున్నట్లు ఎంఎస్పీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు, మాచర్ల నియోజకవర్గ ఇంచార్జ్ గడ్డిపర్తి శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు ఊరే మార్క్ ఆధ్వర్యంలో విజయపురిసౌత్ లో నిర్వహించిన నూతన కమిటీ ఎన్నికలో ఎమ్మార్పీఎస్ యువసేన అధ్యక్షుడు ఊరే మధు ను విజయపురిసౌత్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షుడుగా బొంత అరుణ్ కుమార్, ఎంఎస్పీ అధ్యక్షుడుగా మీసాల దానియేలు, ఉపాధ్యక్షుడుగా సిద్దెల దానియేలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వెల్లడించారు.నూతనంగా ఎన్నికైన సభ్యులు మంద కృష్ణ మాదిగ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు కందుకూరి రమేష్,ఎంఎస్పీ మాచర్ల నియోజకవర్గం అధ్యక్షుడు గ్యార చిన్న మల్లయ్య, ఎమ్మార్పీఎస్ వెల్దుర్తి మండల అధ్యక్షుడు అదిరాల జక్రయ్య, ఎంఎస్పీ వెల్దుర్తి మండల అధ్యక్షులు తాళ్లూరి యాకోబు, ఎంఎస్పీ రెంటచింతల టౌన్ అధ్యక్షులు తాళ్లూరి మరియబాబు,రెంటచింతల యువసేన అధ్యక్షుడు దేగల జక్రయ్య తదితరులు మంద సామేలు, బి.నాగేశ్వరరావు, ఏపూరి ఎలీయ్య, దానియేలు,అది పెద్ద బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# దుగ్గిరాల మండలంలో భక్తిశ్రద్ధలతో రంజాన్

**దుగ్గిరాల, మేజర్ న్యూస్:**

దుగ్గిరాల మండలంలో మతసామరస్యానికి,భక్తి భావానికి ప్రతీకగా నిలిచే రంజాన్ పండుగను సోమవారం ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. 29 రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలు పూర్తిచేసుకుని,ఆ క్రమంలోనే ప్రతి రోజు 5 సార్లు నమాజ్ చేపట్టారు.అంతేకాకుండా పవిత్ర ఖురాన్ గ్రంధాన్ని పారాయణం చేసి,దాన్ని అర్థం చేసుకొని పండుగను జరుపుకున్నారు.ఉదయం 9 గంటలకు పెద్దలు చిన్నారులు ఈద్గా,మసీదుల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు.మండలంలోని దుగ్గిరాల, చిలువూరు,పెనుమూలి, రేవేంద్రపాడు,కంఠంరాజు కొండూరు,మోరంపూడి తదితర గ్రామాల్లో ముస్లింలు ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.చిన్న,పెద్ద తేడా లేకుండా ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మహిళలు ఇంటి వద్దనే ప్రత్యేక ప్రార్థనలు జరుపుకున్నారు.

# ముస్లీం మహిళల సాధికారతే లక్ష్యం : ఎమ్మెల్యే

## జెండా చెట్టుతో విడదీయరాని బంధం మాది

**మాచర్ల ప్రతినిధి, మేజర్ న్యూస్ :**

పేద ముస్లీం మహిళలకు స్వయం ఉపాధి, ఆర్ధిక స్వావలంబనే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తోందని మాచర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురష్కరించుకుని సోమవారం స్థానిక పాతూరులోని ఈద్గా ప్రాంగణంలో వేలాది మంది ముస్లీం సోదర్లతో కలిసి, ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు జూలకంటి. అనంతరం మస్జిద్ అభివృద్ధికి రంజాన్ కానుకగా తనవంతు రూ.లక్ష నగదును విరాళంగా అందజేశారు. అనంతరం ముస్లీం సోదర్లకు రంజాన్ సందేశాన్ని ఇచ్చారు. జెండా చెట్టు బజారుతో జూలకంటి కుటుంబానికి విడదీయరాని బంధం ఉందని గుర్తు చేసుకున్నారు. నూర్ మస్జిద్, షాదీఖానా, కబరస్థాన్ నిర్మాణాలకు ఆనాటి ఎమ్మెల్యేగా ఉన్న జూలకంటి దుర్గాంబ ఎంతో కృషి చేశారని వివరించారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ఈద్గాకు వచ్చిన ఎమ్మెల్యే జూలకంటికి ముస్లీంలు అనాది ఎదుర్కోంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. జమ్మలమడక గ్రామంలో, మండాది రోడ్డు ఎస్కేబీఆర్ కళాశాల వద్ద ఉన్న మస్జిద్ స్థలాలు అన్యాక్రాంతం అయ్యాయని, వాటిని పరిష్కరించాలని ముస్లీంలు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన జూలకంటి.., ఆ స్థలాలను సర్వే చేసి.., గుర్తించేలా తక్షణమే తహశీల్దార్ ను ఆదేశిస్తానని హామీ ఇచ్చారు. అలానే ఖబరస్థాన్ చుట్టూ ప్రహరి నిర్మాణానికి ప్రభుత్వ నిధులు కేటాయించి, అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈద్గా ప్రాంగణంలో బోరు వేయించి.., తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానని చెప్పారు.



మాచర్ల పట్టణంలో నలుగు దిక్కులు ముస్లీంలు వ్యాపించి ఉన్నారని.., వారి అంతిమ యాత్రకు కిలోమీటర్ల దూరం నుంచి ఖబరస్థాన్ కు వాహనాలపై పార్థివ దేహాలను తీసుకురావాలంటే ఆర్థికంగా మోయరాని భారంగా ఉంటుందని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి ముస్లీంలు విన్నివించారు. దీనిపై స్పందిస్తూ .. ముస్లీంల జనాజాకు ప్రత్యేక వాహనం ఒకటి సెప్టెంబర్ నాటికి అందుబాటులో ఉంచుతానని హామీ ఇచ్చారు. ప్రత్యేక వాహనంతో పాటు పర్మెనెంట్ డ్రైవర్ ను, పార్థివ దేహాన్ని భద్రపరిచే ఫీజర్ ను కూడా అందజేస్తానని మాట ఇచ్చారు. త్వరలో మాచర్లలో ఉన్న ఖబరస్థాన్ ను కూడా సందర్శించి..,అక్కడున్న సమస్యలపై గుర్తించి.., ప్రణాళికలు సిద్ధం చేస్తానని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. రంజాన్ ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో ముస్లీం మత పెద్దలు, మాచర్ల పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్ పండుగ) శుభాకాంక్షలు

## - అంజుమన్ కమిటీ అధ్యక్షులు ఎండి ఉస్మాన్ మేస్త్రి





**పిడుగురాళ్ల మేజర్ న్యూస్:**

సోమవారం రోజు దేశవ్యాప్తంగా ఈదుల్ ఫితర్ రంజాన్ పండుగ జరుపుకుంటున్న సందర్భంగా పిడుగురాళ్ల పట్టణ అంజుమన్ కమిటీ అధ్యక్షులు ఎండి ఉస్మాన్ మేస్త్రి ఆధ్వర్యంలో వేలాది ముస్లిం సోదరులు అల్లాహ్ అక్బర్ అల్లాహు అక్బర్ అంటూ తక్బీర్ చదువుతూ నడుచుకుంటూ జానపాడు రోడ్డులోని ఈద్గా లో నమాజు జరుపుకోవడానికి వెళ్లారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ ఆస్తుల సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లిం సోదరులందరూ నల్ల బ్యాడ్జి ధరించి ఈద్గాకు చేరుకున్నారు. అంజుమన్ కమిటీ అధ్యక్షులు ఎండి ఉస్మాన్ మేస్త్రి రంజాన్ పండుగ విశిష్టత గురించి మాట్లాడుతూ... సర్వ మానవాళికి మార్గదర్శకమైన ఖురాన్ ను అల్లాహ్ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పై అవతరింపజేసినందుకు ప్రతిఫలంగా ఈ నెలలో ముస్లిం సోదరులు ఉపవాసాలు ఉండి దేవునికి కృతజ్ఞతలు తెలుపుతారు. ఈ రంజాన్ మాసంలో ఖురాన్ సిద్దాంతం ప్రకారం తాము సంపాదించిన దానిలో పేదవారి కొరకు నూటికి రెండున్నర రూపాయలు చొప్పున తీసి దానం చేయాలని ఖురాన్ చెబుతోంది. రంజాన్ నెలలో ఇలా దానం చేస్తే నిరుపేద వారు కూడా పండుగ పూట సంతోషంగా పండుగ జరుపుకుంటారని తెలిపారు. ఈ దానధర్మ గుణం, భక్తి భావన సంవత్సరం మొత్తం అనుసరించాలని పవిత్ర రంజాన్ నెలతో ప్రారంబిస్తారు. ఆకలి అంటే ఎంత కఠినంగా ఉంటుందో స్వయంగా అనుభవిస్తే తప్ప అనుభవంలోకి రాదు. లోకంలో ఎంతో మంది అభాగ్యులు, నిరుపేదలు ఆకలితో అలమటిస్తూ దుర్భరమైన జీవితాలను వెల్లబుచ్చుతున్న వారి కొరకు మానవత్వంతో విధిగా తమ సంపాదనలో కొంత శాతం కేటాయించి సాటివారికి దాన ధర్మాలు చేయాలి అని సూచించారు. మనకు ఆకలి వేస్తే భరించడం ఎంత కష్టమో 'రోజా' ఉపవాసం ద్వార తెలియజేసి సాటి నిరుపేదలకు దానధర్మాలు చేయమని పవిత్ర ఖురాన్ సూచిస్తుంది అన్నారు. ఈద్గాలో ముస్లిం సోదరుల కోసం టెంట్లు, కూలర్లు ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఎండి గఫార్, నియోజకవర్గ మైనార్టీ నాయకులు ఎండి జబ్బార్, పట్టణ మైనార్టీ అధ్యక్షులు యూసుఫ్ జానీ, అంజుమన్ కమిటీ సెక్రటరీ షేక్ మస్తాన్ వలి, పల్నాడు జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ ఛైర్మన్ ఎండి రషీద్, ముఫ్తీ అబ్దుల్ ఖాదర్, ఆఫీస్ అబ్దుల్ ఖాదర్, ఖిద్మత్ టౌన్ కమిటీ అధ్యక్షులు ఎండి బాబర్, పట్టణ మైనార్టీ కౌన్సిలర్లు నెంబర్ అబ్దుల్లా, సైదావలి, కరీముల్లా, మైనార్టీ సోదరులు జానీబాబు, భాషా, కరీముల్లా, సయ్యద్ బాషా, ఎండి లతీఫ్, ఎండి ఖయ్యూం, ఎండి సిద్దిక్, ఆప్టికల్ జానీ భాష, యూత్ నాయకులు యండి అలీం, మజీద్, కరీం, రహీం మరియు ముస్లిం పెద్దలు ముస్లిం యూత్ పాల్గొన్నారు.

# రంజాన్ పండుగ ఆనందోత్సవాలలో ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ చదివిన గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు..







**పిడుగురాళ్ల మేజర్ న్యూస్:**

గురజాల నియోజకవర్గం ముస్లిం సోదర సోదరీమణులకు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఉర్దూలో అస్సలామ్ మలేకుం, ఈద్ ముబారక్ అంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం పిడుగురాళ్ల పట్టణం లోని యరపతినేని నగర్ లోని ఈద్ గా లో గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు ముస్లిం సోదరులతో కలిసి ఆనందోత్సవాలతో ఈదుల్ ఫితర్ నమాజ్ చదివి రంజాన్ వేడుకలు జరుపుకున్నారు. ఈ నమాజ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఈద్ ముబారక్ అంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ "పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఎంతో నియమనిష్టలతో నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు తీసుకుని ఉపవాసాలు ఉండి ఉపవాస దీక్షలు ముగించి, ఈదుల్ ఫితర్ నమాజు చదువుకుంటున్న ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు,గత రంజాన్ పండుగకు నమాజ్ కు వచ్చినప్పుడు నేను మాజీ శాసనసభ్యుణ్ణి ఇప్పుడు మీ అందరి ఆశీస్సులతో అల్లా దయతో ఈ రంజాన్ పండుగ కు శాసనసభ్యునిగా మీ ముందున్నాను. ముస్లిం సోదరులందరూ అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో తులతూగాలని, అన్ని వృత్తులకు సంబంధించిన వారు చేతినిండా పని ఉండి అందరి కుటుంబాలు ఆనందంగా ఉండాలని ఆ "అల్లాహ్" ని వేడుకుంటూ, నేను ముస్లిం కుటుంబంలో పుట్టకపోయినా ముస్లిం సోదర సోదరీ మణులకు సేవ చేసుకునే భాగ్యం కలిగినందుకు ఆనందపడుతు న్నాను. రాజకీయ జీవితంలో ఉన్నన్నాళ్లు, తర్వాత కూడా ముస్లిం సోదరులకు అండగా ఉంటానని ఇప్పుడు మనమందరం నమాజ్ చదువుకుంటున్న ఈద్గా ను రెండు రాష్ట్రాల్లో ఎక్కడా లేనివిధంగా మూడు ఎకరాలు స్థలం శాంక్షన్ చేపించి ముస్లిం సోదరులకు నా వంతు సాయంగా నా సొంత డబ్బులతో ఈద్గా ఏర్పాటు చేయడం జరిగింది. గత పాలకులు ఈద్గాలో ముస్లిం సోదరులకు సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి పార్టీల వంకతో ఇక్కడ ఎటువంటి ఏర్పాటు చేయకపోయినా మనమే చేశాం. మీ అందరి ఆశీస్సులతో ముస్లింల చిరకాల కోరిక అయినటువంటి "హజ్ యాత్రకు" నేను కూడా పాలు పంచుకోవాలనే ఉద్దేశ్యంతో భారతదేశంలోని ఏ ఎమ్మెల్యే చేయనంతగా హజ్ కు వెళ్లే సోదర సోదరీమణులకు తలా రూ.లక్ష రూపాయలు ఇచ్చి సుమారు 50 మందిని మక్కా యాత్రకు పంపించి ఆ పుణ్యంలో పాలుపంచుకున్నాను అని అన్నారు. గురజాల నియోజకవర్గంలో మనం పెట్టిన తర్వాతే మొన్న 2024 ఎన్నికల్లో కూటమి ఎజెండాలో కూడా హజ్ యాత్రకు లక్ష రూపాయలు ఇస్తామని ప్రకటించడం జరిగింది. ఇకనుండి హజ్ కు వెళ్లే ముస్లిం సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం నుండి లక్ష రూపాయలు గురజాల నియోజవర్గ ముస్లిం సోదరులకు నా తరపున లక్ష రూపాయలు ఇచ్చి పంపించడం జరుగుతుందని అన్నారు. పార్టీలకతీతంగా ముస్లిం సోదరుల్లో ఒకడిగా ఉంటూ మీకు సేవ చేసుకుంటానని, మీరు కూడా మీలో ఒకడిగా నన్ను ఆదరించాలని" ఈ సందర్భంగా కోరారు.

పవిత్ర రంజాన్ పర్వదిన సందర్భంగా పిడుగురాళ్ల పట్టణం యరపతినేని నగర్ లోని ఈద్గా జానపాడు రోడ్డు లోని ఈద్గా నందు నమాజ్ చదివే ముస్లిం సోదర సోదరీమణులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పిడుగురాళ్ల మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో కూలర్ లు, టెంట్ లు షామియానాలు, త్రాగునీరు సదుపాయాలు కల్పించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఖాజీ మౌలానా అబ్దుల్ కరీం నమాజ్ చదివించారు. పల్నాడు జిల్లా మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ అమీర్ అలీ శాసనసభ్యులు శ్రీనివాసరావుని ముస్లిం సాంప్రదాయ దుస్తుల్లో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ అధ్యక్షులు షేక్ బాబావలి, పల్నాడు జిల్లా మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ అమీర్ అలీ, పట్టణ మైనార్టీ అధ్యక్షులు షేక్ టిడిపి మస్తాన్ వలి, పట్టణ ఉపాధ్యక్షులు కార్ షైదా, షేక్ టిడిపి బాషా, ఫరీద్ మేస్త్రి, పెద్ద బుడే, షేక్ ఖాదర్ వలీ, షేక్ ముజీబ్, సయ్యద్ ఇర్షాద్, డాక్టర్ వలీ, డాక్టర్ సర్దార్, వాచర్ బుడే, అబ్దుల్ గనీ, షేక్ రజాక్ సోఫి, మోమిన్ గని, పఠాన్ ఖాసిం, షేక్ ఇంతియాజ్, షఫీ లతో పాటు పిడుగురాళ్ల మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు , పట్టణంలోని తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కూడా పాల్గొని ముస్లిం సోదరులతో పాటు ఈద్ నమాజ్ ఆచరించి ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసారు. ముస్లిం సోదరులు అందరూ ఆనందోత్సాహాలతో ఒకరినొకరు శుభాకాంక్షలు తెలియజేసుకుని ముఖ్యఅతిథిగా విచ్చేసిన యరపతినేని శ్రీనివాసరావుని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు..

## పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాస రావు ఆదేశాల మేరకు.

**పల్నాడు జిల్లా క్రైమ్ న్యూస్**

రంజాన్ పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన పోలీసు భద్రత. సోమవారం రోజు ఈద్ ఉల్ ఫితర్(రంజాన్) పండుగ సందర్భంగా మసీదుల వద్ద ఈద్గాల వద్ద పటిష్టమైన పోలీస్ భద్రత ఏర్పాట్లు చేపట్టారు. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాస రావు ఆదేశాల మేరకు ఈరోజు జిల్లావ్యాప్తంగా పోలీస్ సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉంటూ బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు.



పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాస రావు ఆదేశాల మేరకు. రంజాన్ పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన పోలీసు భద్రత.సోమవారం రోజు ఈద్ ఉల్ ఫితర్(రంజాన్) పండుగ సందర్భంగా మసీదుల వద్ద మరియు ఈద్గాల వద్ద పటిష్టమైన పోలీస్ భద్రత ఏర్పాట్లు చేపట్టారు. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాస రావు ఆదేశాల మేరకు ఈరోజు జిల్లా వ్యాప్తంగా పోలీస్ సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉంటూ బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు.. పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు, దుర్గా మసీదులు ,ఈద్గాల వద్ద ప్రాం ్థనలు చేపట్టడంతో, ఏ విధమైనటువంటి సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసు కున్నారు. వాహనాల రాకపోకలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టారు. పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు మసీదులు, ఈద్గాల వద్ద ప్రార్థనలు చేపట్టడంతో, ఏ విధమైనటువంటి సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. వాహనాల రాకపోకలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టారు.

## అగ్నిప్రమాద బాధితులకు శివశక్తి ఫౌండేషన్ ఆర్థిక సాయం




వినుకొండ మేజర్ న్యూస్ :- నియోజకవర్గంలోని బొల్లాపల్లి మండలం గరికపాడు, వినుకొండమండలం పెదకంచర్లలో ఇటీవల జరిగిన దుర్ఘటనల్లో అగ్నిప్రమాదాల వల్ల సర్వం కోల్పోయిన కుటుంబాలకు చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు కుటుంబ ఆధ్వర్యంలోని శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ఆపన్న హస్తం అందించింది. ఇళ్లు, ఆస్తులు బూడిదై నష్టపోయిన బాధితులకు ఆర్థిక సాయంతో పాటు జీవనాధారాన్ని కల్పించేందుకు అండగా నిలిచింది. పెదకంచర్ల గ్రామానికి చెందిన ఒంటేరు బాలకోటేశ్వరరావు కుటుంబం అగ్నిప్రమాదంలో తీవ్రంగా నష్టపోయింది. వారికి ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఫౌండేషన్ తరపున స్వయంగా సాయం చేశారు. వంట సామగ్రి, నిత్యావసర వస్తువులు, బియ్యం, దుస్తులతో పాటు ఆర్థిక సహాయం అందజే శారు. గరికపాడు గ్రామానికి చెందిన కొక్కర వీరాంజీ కుటుంబానికి కూడా రూ. 5,000 నగదు సాయంతో పాటు వంట సామగ్రి, బియ్యం, దుస్తులు, నిత్యావసర సరుకులు అందించారు. వారికి ఫౌండేషన్ చైర్‌పర్సన్ లీలావతి స్వయంగా ఈ సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ అగ్నిప్రమాద బాధితులకు అండగా నిలవడం కనీస బాధ్యత అని శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ద్వారా ఈ కుటుంబాలకు సాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. కష్ట సమయంలో అండగా నిలిచిన జీవీ ఆంజనేయులు, శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్‌కు బాధిత కుటుంబాలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జునరావు, మాదాల చిరంజీవి, రామినేని ఆంజనేయులు, ముత్తినేని హనుమంతరావు, దొడ్ల నాగరాజు మాజీ సర్పంచ్, ముక్కంటి వైస్, ముక్కంటి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలపై సమరసిల పోరాటాలకు సిద్ధం కండి సిపిఐ

**నరసరావుపేట మేజర్ న్యూస్:**

ఈరోజు దేశవ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో 10వరోజు ప్రచార ఆందోళన కార్యక్రమాలు భాగంగా నరసరావుపేట బరంపేట 34వ వార్డులులో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, సిపిఐ ఉప్పలపాటి రంగయ్య సీనియర్ నాయకులు మాట్లాడుతూకేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల విడనాడాలని ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ప్రజా వ్యతిరేక విధానాల్ని పాల్పడుతుందని అదేవిధంగా కార్పొరేట్ శక్తులకి నరేంద్ర మోడీ గారు ఊడిగం చేస్తూ రాయితీలు కల్పిస్తూ సామాన్య సామాన్య మధ్యతరగతి ప్రజల పైన పెనుబారాలు మోపుతూ విద్య వైద్యం పేదలకు అందుబాటులో లేకుండా చేస్తుందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపైన సిపిఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా మార్చి 23 నుండి ఏప్రిల్ 14 అంబేద్కర్ జయం సందర్భంగా




దేశవ్యాప్తంగా ప్రచార ఆందోళన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని యావన్మంది ప్రజలు రైతులు కార్మికులు సిపిఐ చేసే పోరాటాల్లో భాగస్వామ్యులై ప్రజా కంటకుల పైన పోరాటం నిర్వహించాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఎస్కే బుడే జమ్ముల వెంకటేశ్వర్లు కార్యక్రమంలో మహిళా సమైక్ ఏరియా కార్యదర్శి ఎస్ దేవి కాలిక స్వాతి చాందిని జ్యోతి సంధ్య అంకమ్మ వెంకాయమ్మతదితరులు పాల్గొన్నారు.

# పేటలో సందడి చేసిన కళ్యాణ్ రామ్

### అర్జున్ సన్నాఫ్ వైజయంతి మూవీ సాంగ్ రిలీజ్ చేసిన కళ్యాణ్ రామ్

**నరసరావుపేట మేజర్ న్యూస్:**

నరసరావుపేట:ప్రముఖ సినీనటుడు నందమూరి కళ్యాణ్ రామ్ నరసరావుపేటలో సందడి చేశారు. కళ్యాణ్ రామ్, సీనియర్ నటి విజయశాంతి ప్రధాన పాత్రల్లో నటించిన అర్జున్ సన్నాఫ్ వైజయంతి మూవీ ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకుంది. సినిమా ప్రమోషన్ లో భాగంగా, ఈ సినిమాకి సంబంధించిన ఓ పాటను స్థానిక రవి కళామందిర్ థియేటర్ లో సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కళ్యాణ్ రామ్ సినిమా పాటకు అనుగుణంగా స్టెప్పులు వేసి నందమూరి అభిమానులను అలరించారు. కళ్యాణ్ రామ్ స్టెప్పులకు థియేటర్లో అభిమానులు ఈలలు వేసి చప్పట్లు కొడుతూ ఆనందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడా అరవింద బాబు కుమారుడు డాక్టర్ చదరవాడ ఆదిత్య




పాల్గొని, కళ్యాణ్ రామ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కోటప్పకొండలో వేంచేసియున్న మహిమాన్వితమైన శ్రీ మేధా దక్షిణామూర్తి చిత్రపటాన్ని ఆయనకు అందించారు. కార్యక్రమానికి మూవీ ఆర్టిస్టులు, టెక్నీషియన్స్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## అడవి పేరంటాలమ్మకు ప్రత్యేకపూజలు - లీలావతి



**వినుకొండ మేజర్ న్యూస్:**

మండలంలోని బొందిలిపాలెం అడవి పేరంటాలమ్మ తిరునాళ్ల సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సతీమణి, శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ లీలావతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తజనుల సందోహం మధ్య ఆమె అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఆమెకు సాదర స్వాగతం పలికారు. అమ్మవారికి లీలావతి ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన లీలావతి అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. అందరిపై ఆమె కరుణాకటాక్షాలు ఉండాలని ప్రార్థించినట్లు గోనుగుంట్ల లీలావతి తెలిపారు.

## ఆకుల ఉమా జయసత్య దంపతులను పరామర్శించిన మంత్రి నారాయణ




**మంగళగిరి, మేజర్ న్యూస్:**

యర్రబాలెం మాజీ ఎంపీటీసీ సభ్యులు, సీనియర్ టీడీపీ నాయకులు ఆకుల ఉమా మహేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు, టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య దంపతులను మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ పరామర్శించారు.ఆకుల ఉమా మహేశ్వరరావు మాతృమూర్తి, జయసత్య అత్త గారైన ఆకుల మాణిక్యం ఈనెల 24వ తేదీన ఆకస్మికంగా మృతి చెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సోమవారం మంత్రి నారాయణ యర్రబాలెం లోని ఉమా జయసత్య దంపతుల నివాసానికి చేరుకుని మాణిక్యం చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. టీటీడీ బోర్డ్ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీ దేవి, టీడీపీ నాయకులు నీలం అంకారావు, గడదాసు రంగారావు, ఫిరోజ్ ఖాన్, కర్నాటి శివ సత్యనారాయణ, సాలి నరేష్, యలమంచిలి పద్మజ, తదితరులు ఉమా జయసత్య దంపతులను పరామర్శించిన వారిలో ఉన్నారు.

## ద్విచక్ర వాహనంపై వచ్చి ఇనుప రాడ్డు తో కస్తూరిపై దాడి

గుంటూరు క్రైమ్, మేజర్ న్యూస్ : గుంటూరులోని కృష్ణనగర్ చెందిన కస్తూరి శ్రీనివాసరావు ద్విచక్ర వాహ నంపై వెళుతుండగా బ్రాడీపేట 2/13వ లైను వద్దకి చేరే సరికి వెనుక నుంచి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మోటార్ సైకిల్పై వెంబడించి ఇనుప రాడ్డుతో దాడికి పాల్పడినట్లు అరండల్ పేట పోలీసులు తెలిపారు. మోటార్ సైకిల్ పై వెంబడించి వెనుక కూర్చున్న వ్యక్తి ఇనుప రాడ్డు తో శ్రీనివాసరావు తల మీద పలుమార్లు కొట్టడంతో తీవ్రంగా రక్త శ్రవం జరిగింది. దాడి చేసిన వారిద్దరూ పారిపోయినట్లు బాధితుడు అరండల్ పేట పోలీసులకు ఫిర్యాదు చేసారు. కస్తూరి శ్రీనివాసరావు తలకి రక్త గాయమవడంతో గుంటూరు లోని జిజిహెచ్ లో ఎమ్మెల్సీ కేసు నమోదు చేసిన అనంతరం కస్తూరి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కత్తు శ్రీనివాసరావుపై దాడి చేసిన ఘటనలో పలువురిపై అనుమానాలు వ్యక్తం చేసినట్లుగా వారు వెల్లడించారు.



# భక్తి శ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు



**పెదకాకాని మేజర్ న్యూస్ :**

మండల పరిధిలోని ఆయా గ్రామాలలో పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులు సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాలు, మసీదుల వద్దకు అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఇమామ్ లు మాట్లాడుతూ ప్రేమ, సోదర భావం, శాంతికి చిహ్నామే రంజాన్ పర్వదినమన్నారు. ప్రతి ఏడాది ముస్లిం సోదరులు రంజాన్ పర్వదినాన్ని జరుపుకుంటారని, నెల రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలు ఉండి అల్లా అనుగ్రహం పొందుతారని తెలిపారు. ఆ అల్లాహ్ చల్లని దీవెనలతో చక్కగా వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. నగరంలోని ఈద్గా షాదీ మహల్ వద్ద పోలీసులు ముస్లింల మత ప్రార్ధనలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ముస్లిం సోదరులు వారి కుటుంబ సభ్యులతో ఆహ్లాదకరమైన, ఆధ్యాత్మిక వాతావరణంలో రంజాన్ వేడుకలను జరుపుకున్నారు.

## ముస్లిం సోదరులందరికీ ఈద్-ముబారక్

### నరసరావుపేట మాజీ శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి



**నరసరావుపేట మేజర్ న్యూస్:**

ఈ రోజు పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా నరసరావుపేట పట్టణంలోని స్థానిక ప్రకాష్ నగర్ లోని ఈద్గాహ్ లో నిర్వహించిన ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ కు ముఖ్య అతిథిగా నరసరావుపేట మాజీ శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని.. ముస్లిమ్ మత పెద్దలు, సోదరులతో కలిసి ఆ అల్లాకు ప్రార్థనలు నిర్వహించి అనంతరం ముస్లిం సోదరసోదరిమణులు అందరికీ ఈద్-ముబారక్ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు..ఈ కార్యక్రమంలో ముస్లిమ్ మత పెద్దలు, మైనారిటీ సోదరులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, నాయకులు మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ లుంజాల లాజరస్

**నరసరావుపేట మేజర్ న్యూస్:**

ఇస్లాంపై విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక రంజాన్ శుభాకాంక్షలు. ఖురాన్ అవతరించిన పవిత్ర మాసం ఇది. ఈ పండగా రోజు ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిసు_్తన్నాను. మి కుటుంబానికి ఆ అల్లా చల్లగా చూడాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ. లాజరస్ ఏ ఈ ఎల్ సి ట్రెజరర్.



రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా మరియు మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డాక్టర్ దాసరి చెన్నకేశవులు అశోక్ కుమార్ గార్ల ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఉగాది పురస్కారాల అవార్డులో భాగంగా నన్ను ఎంపిక చేస్తూ ఈ అవార్డు ని ప్రదానం చేసిన వారికి ఉద్యమ జై భీములు తెలియజేస్తూ.నాతో అవార్డులు అందుకున్న ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు . మీ డాక్టర్ గోదా జాన్ పాల్ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు .



- నరసరావుపేట మేజర్ న్యూస్

## రంజాన్ నియమాల ద్వారా ఎన్నో నేర్చుకోవచ్చు

**కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి.పెమ్మసాని వెల్లడి**

**ముస్లింలతో కలిసి ఈద్గా ప్రార్ధనలో పాల్గొన్న పెమ్మసాని**

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో



పవిత్ర రంజాన్ మాస ఉపవాసం, నియమ నిష్ఠలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ముస్లిం సోదర, సోదరీమణులు పాటించే ఉపవాస దీక్షల వల్ల పేదవాడి ఆకలి ఇబ్బందిని అందరూ తెలుసుకునే అవకాశం ఉంది. కోపం, ఆవేశం, స్వార్థం అనే ఎన్నో దుర్గుణాలను మనిషికి ఎలా దూరంగా ఉంచాలి అనేది ఈ రంజాన్ పవిత్ర మాసం స్పష్టం చేస్తుంది.' అని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులోని రమేష్ హాస్పిటల్, ఆంధ్ర ముస్లిం కళాశాల ఆవరణలో సోమవారం జరిగిన ఈద్గా ప్రార్ధనలకు ఆయన హాజరయ్యారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేసిన అనంతరం పెమ్మసాని కి మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు జరిపి ఆశీర్వాదం అందజేశారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ కఠోర ఉపవాస దీక్షలను ముగించుకొని పవిత్ర రంజాన్ పండుగను జరుపుకుంటున్న ముస్లిం సోదర, సోదరీమణులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసారు.



# వేసవి సెలవుల్లో రైల్వేకు ప్రయాణికుల తాకిడి

- కొన్ని ప్రత్యేక రైళ్ల ఏర్పాటుకు రైల్వే శాఖ శ్రీకారం
- పుణ్యక్షేత్రాలు, పర్యాటక కేంద్రాలను కలుపుతూ రైళ్ల రాకపోకలు



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

వివిధ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించడానికి, దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించాలనుకునే వాళ్ల రద్దీ ఎక్కువగా కనిపిస్తుంటుందీ సీజన్‌లో. ఉగాది, రంజాన్ పండగలు కూడా కలిసి రావడంతో స్వస్థలాలకు బయలుదేరి వెళ్లే వారి సంఖ్య భారీగా ఉంటోంది. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే అధికారులు పలు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. సికింద్రాబాద్ ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలను నిర్వహిస్తోన్న దక్షిణ మధ్య రైల్వే అధికారులు- పలు ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకుని రానున్నట్లు ఇదివరకే ప్రకటించారు

చర్లపల్లి- కన్యాకుమారికి ప్రత్యేక రైళ్లకు ఇవి అదనం. మొత్తం 26 ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి. ఏప్రిల్ 2వ తేదీన తొలి రైలు పట్టాలెక్కనుంది. ఏప్రిల్ 2 నుంచి జూన్ 25వ తేదీ వరకు ప్రతి బుధవారం రాత్రి 9:50 నిమిషాలకు చర్లపల్లి నుంచి బయలుదేరే నంబర్ 07230 ప్రత్యేక రైలు రెండో రోజు మధ్యాహ్నం 2:30 గంటలకు కన్యాకుమారికి చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణంలో ఏప్రిల్ 4వ తేదీ నుంచి జూన్ 23వ తేదీ వరకు ప్రతి శుక్రవారం తెల్లవారు జామున 5:15 నిమిషాలకు కన్యాకుమారి నుంచి బయలుదేరే నంబర్ 07229 ప్రత్యేక రైలు మరుసటి రోజు ఉదయం 11:40 నిమిషాలకు చర్లపల్లికి చేరుకుంటుంది. నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట, తిరుత్తణి, కాట్పాడి, తిరువణ్ణామలై, విల్లుపురం, తిరుప్పడిరిపులియూర్, చిదంబరం, మైలాడుథురై, కుంభకోణం, తంజావూరు, తిరుచిరాపల్లి, దిండగల్, కొడైకెనాల్ రోడ్, మధురై, విరుధునగర్, సత్తూరు, కోవిల్‌పట్టి, తిరునెల్వేలి, వల్లియూర్, నాగర్‌కోయిల్ మీదుగా రాకపోకలు సాగిస్తాయి. తమిళనాడులోని పలు ప్రధాన నగరాలకు రాకపోకలు సాగిస్తోన్న ప్రత్యేక రైళ్లను పొడిగించారు దక్షిణ మధ్య రైల్వే అధికారులు. నంబర్ 07191 కాచిగూడ-మధురై ఏప్రిల్ 7వ తేదీ నుంచి మే 5వ తేదీ వరకు పొడిగించారు. 07192 మధురై- కాచిగూడ ఏప్రిల్ 9 నుంచి మే 7వ తేదీ, 07189 నాందెడ్- ఈరోడ్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 4 నుంచి మే 2 వరకు పొడిగించారు. 07190 ఈరోడ్- నాందెడ్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 6 నుంచి మే 4 వరకు, 07435 కాచిగూడ- నాగర్‌కోయిల్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 4 నుంచి మే 2 వరకు, 07436 నాగర్ కోయిల్- కాచిగూడ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 6 నుంచి మే 4 వరకు, 07601 సికింద్రాబాద్- విల్లుపురం ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 3 నుంచి మే 1 వరకు, విల్లుపురం- సికింద్రాబాద్ ఏప్రిల్ 4 నుంచి మే 2వ తేదీ వరకు పొడిగించారు. ఇప్పుడు తాజాగా గుంటూరు నుంచి కర్ణాటకలోని హుబ్లీకి ప్రత్యేక రైళ్లను నడిపించనున్నారు. ఈ నెల 31వ తేదీన రాత్రి 8 గంటలకు గుంటూరు నుంచి బయలుదేరే నంబర్ 07271 ప్రత్యేక రైలు మరుసటి రోజు ఉదయం 9:20 నిమిషాలకు శ్రీ సిద్ధారూఢ స్వామిజీ హుబ్లీ స్టేషన్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఏప్రిల్ 1వ తేదీన ఎస్ఎస్ఎస్ హుబ్లీ నుంచి ఉదయం 11 గంటలకు బయలుదేరే నంబర్ 07272 ప్రత్యేక రైలు మరుసటి రోజు తెల్లవారుజామున 3 గంటలకు గుంటూరుకు చేరుకుంటుంది. నరసరావుపేట, వినుకొండ, మార్కాపురం రోడ్, కంభం, గిద్దలూరు, నంద్యాల, డోన్, గుంతకల్, బళ్లారి, తోరణగల్లు, హొస్పేట్, మునీరాబాద్, కొప్పల్, బానాపుర, బన్నికొప్ప, గదగ్, అన్నిగేరి మీదుగా ఈ రైళ్లు రాకపోకలు సాగుతాయని అధికారులు వెల్లడించారు.


## విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య

అక్షరానికి నైతికతను అద్ది దేశవ్యాప్తంగా 23 ఎడిషన్లతో సామాజిక న్యాయం వైపు మళ్ళించే యజ్ఞం "నేటి దినపత్రిక సూర్య" చేపట్టింది, అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ యజ్ఞంలో "నేటి దినపత్రిక సూర్య" అక్షర సైనికులను మరి కొంత మందిని నియమించుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పల్నాడు, గుంటూరు జిల్లాలలో ఖాళీగా ఉన్న మండలాలకు విలేకరులకు నియమించుకోవడలిచాము. కావలెను. ఆసక్తిగల వారు ఈ క్రింది మండలాలకు ఈ నెల 31వ తేదీలోగా ఇంటర్వ్యూకి ఈ క్రింది అడ్రస్సులో సంప్రదించగలరు.

1.తాడికొండ, 2. తుళ్లూరు, 3. మేడికొండూరు, 4. ఫిరంగిపురం, 5. ప్రత్తిపాడు, 6. పెదనందిపాడు, 7. కాకుమాను, 8.వట్టిచెరుకూరు, 9.అమరావతి, 10.గుంటూరు రూరల్, 11.గుంటూరు జిల్లాపరిషత్, 12. దాచేపల్లి, 13. బొల్లాపల్లి, 14. పెదకూరపాడు, 15. పొన్నూరు

**పి. బాలు (చిన కొండయ్య)**
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777

జిల్లా ఇన్‌చార్జిలు : జి.శ్రీనివాసరావు సెల్ : 9959426987 ఆర్.డి.నాయక్ సెల్ : 8897455466

ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాంతీయ కార్యాలయం, 9/1, అరండల్‌పేట, గుంటూరు.

## నేటి దినపత్రిక సూర్య కుటుంబ సభ్యులు

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

"నేటి దినపత్రి సూర్య" ను ఆదరిస్తున్న గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని విశేష పాఠకులు, అధికారులు, రాజకీయ నాయకులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం... ఏదైనా వార్తలు, ప్రకటనలు, యాడ్స్, క్లాసిఫైడ్స్, లీగల్ నోటీసులు ఇలాంటి ప్రకటనలను మా ఈ క్రింది పాత్రికేయులకు తెలియజేయగలరు. నరసమైన ధరలకు యాడ్స్ పబ్లిష్ చేయబడును. మా పత్రికలో పనిచేస్తున్న పాత్రికేయ బృందం.

పి. బాలు (చిన కొండయ్య) – బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777
జి.శ్రీనివాసరావు – గుంటూరు జిల్లా ఇన్‌చార్జి సెల్ : 9959426987
ఆర్.ధావుర్య నాయక్ (సూర్య ఆర్.డి.) – స్టాఫ్ రిపోర్టర్, గుంటూరు జిల్లా. సెల్ : 8897455466
ఎం.ఏడుకొండలు – సత్తెనపల్లి ఆర్.సి. ఇన్‌చార్జి సెల్ : 9030880455
జి.హిరణ్మాయి(కన్నల్) – నరసరావుపేట ఆర్‌సి ఇన్‌చార్జి జిల్లా క్రైమ్ రిపోర్టర్
చెట్టిపోగు కాశి – దాచేపల్లి రిపోర్టర్ సెల్ : 9963343327
శేషగిరి రాజు – మాచర్ల ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 8341408201
వై.ఏసుబాబు – గురజాల ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 9701250872
బి.పూర్ణచంద్రరావు – సత్తెనపల్లి రిపోర్టర్ సెల్ : 9866246951
చెవుల రంగారావు – మెడికల్ రిపోర్టర్, గుంటూరు సెల్ : 9490544635
యం.కృష్ణ – మంగళగిరి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9393309149
వి.రవికుమార్ – తెనాలి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 99083 38200
డి. చైతన్య – వినుకొండ ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9381968453
జి.ఏలియా – ముప్పాళ్ళ రిపోర్టర్ సెల్ : 9392231959
వి.వెంకటరెడ్డి – బొల్లాపల్లి రిపోర్టర్ సెల్ : 80191 99991
బి.సాంబశివరావు – రాజుపాలెం రిపోర్టర్ సెల్ : 9949382676
రమేష్ – దుగ్గిరాల రిపోర్టర్ సెల్ : 9866782780
ఎస్.వెంకటేశ్వర్లు – పెదకాకాని రిపోర్టర్ సెల్ : 9948175840
కె.నాగరాజు – రిపోర్టర్, గుంటూరు సెల్ : 7799881000
డి.రమేష్ – ఈపూరు రిపోర్టర్ సెల్ : 9110734898
పి.లక్ష్మీనారాయణ – నూజెండ్ల రిపోర్టర్ సెల్ : 9666474953
ఎస్.కె. రవూఫ్ – శావల్యాపురం రిపోర్టర్ సెల్ : 7989434737
అక్కిరెడ్డి – నరసరావుపేట మెడికల్ రిపోర్టర్ సెల్ : 9849134987
పి.మణికంఠ – మాచర్లటౌన్ రిపోర్టర్ సెల్ : 7013169885
ఎస్.డి.మహబూబ్ – మాచర్ల క్రైం రిపోర్టర్ సెల్ : 9989124898
పి.వెంకటేశ్వర్లు – దుర్గి రిపోర్టర్ సెల్ : 8185815858
టి.శ్రీకాంత్ – వెల్దుర్తి రిపోర్టర్ సెల్ : 9912818723
ఎస్.విజయభాస్కర్ – గుంటూరు రిపోర్టర్ సెల్ : 9440822538
షేక్ నాగూర్ – నకరికల్లు రిపోర్టర్ సెల్ : 98489 26300
ఎం.కోటేశ్వరరావు – మాచవరం రిపోర్టర్ సెల్ : 6303775169
డి.మల్లికార్జునరావు – యడ్లపాడు రిపోర్టర్ సెల్ : 8309237441
పి.ఆనంద్ – వినుకొండ రూరల్ రిపోర్టర్ సెల్ : 8125125239
నాగరాజు – మంగళగిరి టౌన్ రిపోర్టర్ సెల్ : 9032258913
రమేష్ – నరసరావుపేట రూరల్ రిపోర్టర్ సెల్ : 7075942600
తెళ్ల రవీంద్రబాబు – గుంటూరు రిపోర్టర్ సెల్ : 7396234032

"నేటి దినపత్రిక సూర్య"
ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యాలయం. 9/1, అరండల్‌పేట, గుంటూరు.